సాక్షి రంగారెడ్డి
మంగళవారం । 25 । మార్చి । 2025



శాశ్వత కార్డులు
రాష్ట్ర ప్రభుత్వం సదరం క్యాంపులో దివ్యాంగులను గుర్తించి వారికి సర్టిఫికెట్లను అందిస్తోంది.
8లో▸



నోటిఫికేషన్ రద్దు చేయండి
భూ సేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని మొండిగౌరెల్లి రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
8లో▸



న్యూస్‌రీల్

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే, నాయకులు


పీసీసీ అధ్యక్షుడితో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

శంకర్‌పల్లి: పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ని సోమవారం హైదరాబాద్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, శంకర్‌పల్లి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలపై కాసేపు చర్చించారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు వారికి దిశానిర్దేశం చేశారు. కలిసిన వారిలో నాయకులు గోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, రఘునందన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల కల్యాణ తలంబ్రాలు

ఇబ్రహీంపట్నం: భద్రాచలంలో జరగబోయే సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు ఇంటి వద్దే అందజేసేందుకు ఆర్టీసీ ఏర్పాటు చేసినట్లు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకట నర్సప్ప తెలిపారు. తలంబ్రాల కోసం రూ.151 చెల్లించి స్థానిక డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌కు ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 80962 33133 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నూతన నియామకం


నియామకపత్రం అందుకుంటున్న దర్శన్‌గౌడ్

మొయినాబాద్: గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శిగా మండలానికి చెందిన రేనట్ల దర్శన్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ చేతుల మీదుగా సోమవాం నగరంలోని లంగర్‌హౌస్‌లో ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కుల హక్కుల సాధనకు కృషి చేస్తానని, సంఘం అభివృద్ధికి తోడ్పాటు నందిస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'చలో రామోజీ ఫిలింసిటీ'


జగన్

ఇబ్రహీంపట్నం రూరల్: పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల విముక్తి కోసం బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న 'చలో రామోజీ ఫిలిం సిటీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బాధిత పోరాట కమిటీ కన్వీనర్ పి.జగన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి రెవెన్యూ సర్వే నంబర్లు 189, 203లో ఫిలిం సిటీ యాజమాన్యం ఆక్రమించిన పేదల స్థలాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు అనేక సార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరయ్యే ఈ కార్యక్రమానికి బాధితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు వారికి పెళ్లి చేయడం ఎంతో భారం అన్నారు. ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో అండగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, తహసీల్దార్ జైరాం, నాయకులు ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఇది.. సర్కారు వారి భూమి


గురునానక్ కళాశాల గేటులో బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

- రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ
- సివిల్ రైట్ ప్రొటక్షన్ ఆర్గనైజేషన్ ఫిర్యాదు
- రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు
- కబ్జా చెర నుంచి విముక్తి
- ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డుల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం రూరల్: రూ.100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కబ్జా చెర నుంచి కాపాడారు. 'ఇది ప్రభుత్వ భూమి' అంటూ బోర్డులు పాతారు. వివరాలివీ.. ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని ఖానాపూర్‌లో 33 ఎకరాల అసైన్డ్ భూమిని 60 మందికి ఇవ్వగా వారు అమ్ముకున్నారు. గ్యాప్ ఏరియా కింద చూపిన భూములను రియల్ వ్యాపారులు కొనుగోలు చేసి ఏకంగా హెచ్‌ఎండీఏ, పంచాయతీ వెంచర్లు చేశారు. దీనిపై సివిల్ రైట్ ప్రొటక్షన్ ఆర్గనైజేషన్ ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పుష్పలత, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి సర్వే చేశారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని జేబీ రియల్ ఎస్టేట్ సంస్థలో సుమారు 12 ఎకరాల భూమిని గుర్తించారు. గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు ఎకరాలకు పైగా ఆక్రమించారని తేల్చారు. మిగతాది రియల్‌వ్యాపారులు అంతా కలిసి కొత్తగా సర్వే నంబర్ 80 పట్టా నంబర్‌తో రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం గురునానక్ కళాశాలలో, జేబీ వెంచర్, పక్కనే ఉన్న హెచ్‌ఎండీఏ వెంచర్, సత్యనారాయణ వెంచర్‌లో ప్రభుత్వ భూమి అని బోర్డులు పాతించారు. పూర్తి స్థాయిలో భూములను స్వాధీనం చేసుకొని కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.100 కోట్లకుపైగా ఉంటుందని తెలిపారు.


ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో బోర్డు పాతుతున్న అధికారులు


ఇబ్రహీంపట్నంలోని స్థిరాస్తి సంస్థలో పాతిన బోర్డు

మాకూ ఓ మంత్రి కావాలి

జిల్లాకు అమాత్య యోగం వచ్చేనా..
- మంత్రి వర్గ విస్తరణపై ఊహాగానాలు
- ఇప్పటికీ జిల్లా నుంచి కరువైన ప్రాతినిధ్యం
- నిరుత్సాహంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు
- తమకూ ఓ మంత్రి కావాలంటూ విన్నపాలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇతర జిల్లాల కంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే జనాభా అధికం. విస్తీర్ణపరంగానూ పెద్దదే. అనేక రాజకీయ శిబిరాలకు జిల్లా కేంద్ర బిందువుగా మారింది. అధికార పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా ఇక్కడి నుంచే తరచూ శ్రీకారం చుడుతోంది. సభలు, సమావేశాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. అయినప్పటికీ కీలకమైన జిల్లా నేతలకు మంత్రి మండలిలో మాత్రం ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'మాకూ ఓ మంత్రి కావాల్సిందే' అంటూ జిల్లా నేతలు పట్టుబడుతుండడం చర్చనీయాంశంగా మారింది.

ఈసారైనా చోటు దొరికేనా..

నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు, మంత్రి పదవులను ఆశించి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడిగాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తలలపై ఇప్పటికే కత్తి వేలాడుతోంది. ఎమ్మెల్యేల పార్టీ మార్పు అంశంపై కేసు ఫైనల్ స్టేజీలో ఉంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మంత్రి మండలిలో అవకాశం అనుమానమే. షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయణరెడ్డి తొలిసారిగా హస్తం గుర్తుపై గెలుపొందారు. వీరిద్దరూ జూనియర్లే కావడంతో మంత్రి పదవి దక్కే చాన్స్ తక్కువే. ఇక చేతి గుర్తుపై ఇప్పటికే రెండుసార్లు గెలుపొందిన ప్రస్తుత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. నిజానికి తొలి మంత్రి వర్గంలోనే తనకు చోటు లభిస్తుందని ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికీ అవకాశం రాకపోవడంతో అధిష్టానంపై కొంత గుర్రుగా ఉన్నారు. గాంధీభవన్ సాక్షిగా పార్టీ పెద్దలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. అధిష్టానం ఆదేశాలతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులిద్దరూ సోమవారం సాయంత్రం ఢిల్లీకి పయనం కావడం.. త్వరలో మంత్రి మండలిని విస్తరించనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో మరోసారి జిల్లాలో చర్చ మొదలైంది. త్వరలో విస్తరించనున్న మంత్రి మండలిలో జిల్లా నేతలకు అవకాశం కల్పిస్తారా.. లేదంటే మళ్లీ మొండి చేయి చూపిస్తారా.. అనేది వేచి చూడాల్సిందే.

అధికారపార్టీలో అసమ్మతి రాగం

జిల్లాకు మంత్రి లేకపోవడం.. ఇన్‌చార్జి మంత్రిని కలిసే అవకాశం కేడర్‌కు దక్కకపోవడం ఇబ్బందిగా మారింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా నుంచి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా రెడ్డి మంత్రిగా పని చేశారు. అన్నీ తానై వ్యవహరించారు. చివరి దశలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి దక్కింది. అంతకు ముందు ప్రభుత్వాల్లోనూ జిల్లా నేతలే కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లా నేతలెవరికీ ఆ అవకాశం కల్పించకపోవడంపై సొంత పార్టీలోనే తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తోంది. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే ఎమ్మెల్యేగా రాజీనామా చేయడానికి సైతం వెనుకాడబోనని ఇటీవల ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అల్టిమేటం జారీ చేయడం, అధిష్టానంపై అక్కసు వెళ్లగక్కడం తెలిసిందే. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు అవకాశం ఎందుకు కల్పించరనే ప్రశ్న కేడర్‌లో ఉత్పన్నమవుతోంది. ఇదిలా ఉంటే బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు ఆ తర్వాత అధికార కాంగ్రెస్‌లో చేరడంతో సంస్థాగతంగా పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. క్షేత్రస్థాయిలో నేతలను సమన్వయం చేసే నాయకుడు లేకపోవడంతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ విషయంలో డీసీసీ అధ్యక్షుడు సైతం చేతులెత్తేస్తుండటం ఇబ్బందికరంగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ భారీగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'ఫ్యూచర్ సిటీ' కోసం 36 పోస్టులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కోసం 36 పోస్టులను కేటాయించినట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో కేడర్, నాన్ కేడర్ పోస్టులు ఉన్నాయి, ఐఏఎస్ కేడర్ ఉన్నవారిని కమిషనర్ పోస్టుల్లో, ప్రమోషన్ల మీద ఉన్నవారిని నాన్ కేడర్ పోస్టుల్లో నియమించింది. కమిషనర్, అడిషనల్ కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫైనాన్షియల్ అడ్వయిజర్, అకౌంట్స్ ఆఫీసర్, డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అడిషనల్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్, ప్లానింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, ఆర్కిటెక్ట్, డ్రాఫ్ట్‌మెన్, సర్వేయర్, జీఐఎస్ ఎక్స్‌పర్ట్, టెక్నికల్ అసిస్టెంట్, ఛీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్, లీగల్ సెక్రటరీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించింది. పరిపాలనా విభాగం, ఆర్థిక విభాగం, మానిటరింగ్ యూనిట్ ఎస్టేట్ ఆఫీస్, లీగల్ వింగ్ విభాగాల్లో పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అందించే వినతులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈవారం ప్రజావాణికి 56 ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 25, ఇతర శాఖలకు సంబంధించి 31 ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపాలిటీ, మండల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగిరం చేయాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగిరం చేయాలని పీడీ హౌసింగ్‌కు సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని డీపీఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు ముగిసిన వెంటనే హాస్టళ్లు, సంక్షేమ వసతి గృహాల్లో ఉండే పిల్లలను జాగ్రత్తగా వారి ఇళ్లకు పంపించేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియెట్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బస్వ పాపయ్య గౌడ్

పేదల భూములు లాక్కుంటే ఊరుకోం


కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్

మహేశ్వరం: ఫ్యూచర్ సిటీ పేరుతో పేద రైతుల భూములు తీసుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని, వారి పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని, మహేశ్వరాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీకి భూసేకరణ కోసం సుమారు 30 వేల ఎకరాలను పేదల నుంచి గత, ప్రస్తుత ప్రభుత్వాలు తీసుకున్నాయని ఆ భూమిలో అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధి పేరుతో పేదల భూములను లాక్కొని పెట్టుబడిదారులకు అధిక ధరకు విక్రయించి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ, 350 ఫీట్ల రేడియల్ రోడ్ల నిర్మాణం పేరుతో పేదల భూములు బలవంతంగా లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, పార్టీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్లు అనంతయ్య గౌడ్, కుండె వెంకటేశ్, మండల అధ్యక్షుడు టి.యాదీష్, గిరిజనమోర్చా రాష్ట్ర నాయకుడు దేశ్యా నాయక్, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు కాసాని వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్.. 'ఓపెన్'

వచ్చే నెల 20 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

- రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 48 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 10,218 మంది విద్యార్థులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు



కేశంపేట: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఏప్రిల్ 20నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30గంటల వరకు పరీక్షల సమయం ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో పదో తరగతికి పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల పరిధిలో 2,158మంది విద్యార్థులు, ఇంటర్మీడియెట్‌కు 13 పరీక్ష కేంద్రాల పరిధిలో 2,965 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వికారాబాద్ జిల్లాలో పదో తరగతికి మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల పరిధిలో 597 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇంటర్మీడియెట్‌కు ఐదు పరీక్ష కేంద్రాల పరిధి లో 973 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మేడ్చల్ జిల్లా పరిధిలో పదో తరగతికి ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,482 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పది పరీక్ష కేంద్రాల పరిధిలో 2,043 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఏప్రిల్ 26 నుంచి మే 3వరకు ఉండనున్నాయి. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు.

ఓపెన్ టెన్త్ పరీక్షలు ఇలా..

తేదీ	9-12 గంటల వరకు	2.30- 5.30 గంటల వరకు
20	తెలుగు, కన్నడ, తమిళం	ఫిజియోలజీ, మరాఠీ
21	ఆంగ్లం	ఇండియన్ కల్చర్ అండ్ హెరిటేజ్
22	గణితం (మ్యాథమటిక్స్)	బిజినెస్ స్టడీస్
23	సైన్స్ అండ్ టెక్నాలజీ	హిందీ
24	సోషల్‌స్టడీస్	ఉర్దూ
25	ఎకనామిక్స్	హోంసైన్స్
26	ఆల్ ఒకేషనల్ సబ్జెక్టులు థియరీ	ఆల్ ఒకేషనల్ సబ్జెక్టులు ప్రాక్టికల్స్

ఓపెన్ ఇంటర్ పరీక్షలు ఇలా..

తేదీ	9-12 గంటల వరకు	2.30-5.30 గంటల వరకు
20	తెలుగు, ఉర్దూ, హిందీ	అరబిక్
21	ఆంగ్లం	సోషియాలజీ
22	పొలిటికల్‌సైన్స్	కెమిస్ట్రీ, పెయింటింగ్
23	కామర్స్/బిజినెస్ స్టూడెంట్స్	ఫిజిక్స్, ఫిజియోలజీ
24	హిస్టరీ	గణితం, జియోగ్రఫీ
25	ఎకనామిక్స్, మాస్ కమ్యూనికేషన్	బయోలజీ, అకౌంటెన్సీ, హోం సైన్స్
26	ఆల్ ఒకేషనల్ సబ్జెక్టులు	-

గృహిణికి అండగా ఉన్నందుకు...
అంతమొందించాడు

చంపాపేటలో న్యాయవాది దారుణ హత్య
- గృహిణిపై లైంగిక వేధింపులను అడ్డుకున్నందుకు కక్షపూనిన వైనం
- మూడు రోజులుగా రెక్కీ...
- అనంతరం పక్కా ప్లాన్‌తో కత్తితో దాడి చేసిన ఎలక్ట్రీషియన్


రక్తపు మడుగులో ఇజ్రాయిల్


ఇజ్రాయిల్ (ఫైల్)


నిందితుడు దస్తగిరి

చంపాపేట: లైంగిక వేధింపులకు గురవుతున్న ఓ మహిళకు అండగా ఉన్న లాయర్‌ను కక్షగట్టి దారుణంగా హత్య చేశాడు. చంపాపేటలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి బంధువులు తెల్పిన వివరాల ప్రకారం..మహేశ్వరం మండల కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎర్రబాబు ఇజ్రాయిల్ (56) నగరంలోని చంపాపేట డివిజన్ న్యూమారుతీనగర్ కాలనీలో నివసిస్తున్నాడు. తన ఇంటి సమీపంలోనే ఓ అపార్ట్‌మెంట్‌లో ఇటీవల ఫ్లాట్‌ను కొనుగోలు చేసి.. ఓ గృహిణి కుటుంబ సభ్యులకు అద్దెకు ఇచ్చాడు. అదే కాలనీ సమీపంలోని సుల్తానా అల్వా కాలనీ శ్మశాన వాటిక కాపలాదారుడుగా పని చేస్తున్న గులాం దస్తగిరి ఖాళీ సమయంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా కూడా పనిచేస్తున్నాడు. ఇజ్రాయిల్ కొనుగోలు చేసిన ఫ్లాట్‌లో దస్తగిరి విద్యుత్ మరమ్మతు పనులకు వెళ్తుండే వాడు. ఈ క్రమంలోనే ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్న గృహిణితో పరిచయం ఏర్పడింది. దీన్ని అలుసుగా తీసుకున్న దస్తగిరి తనను ప్రేమించాలని, అండగా ఉంటానని ఆమెను వేధించసాగాడు. వేధింపులు భరించలేని ఆ గృహిణి ఇజ్రాయిల్‌కు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఆయన దస్తగిరిని మందలించాడు.

పోలీసులకు ఫిర్యాదు చేయించి..

దస్తగిరి వేధింపులు ఎక్కువ అవడంతో 25 రోజుల క్రితం ఇజ్రాయిల్ ఐఎస్‌సదన్ పోలీసులకు గృహిణితో ఫిర్యాదు చేయించాడు. ఆమెకు దస్తగిరి నుంచి ప్రాణహాని ఉందని హెచ్చరించాడు. ఆమెను బంధువుల ఇంటికి పంపించి వేశాడు. ఈ క్రమంలో పోలీసులు దస్తగిరిని స్టేషన్‌కు పిలిపించి..నామమాత్రంగా మందలించి, కౌన్సిలింగ్ చేసి పంపించేశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన దస్తగిరి.. ఇజ్రాయిల్‌పై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అతన్ని అంతం చేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. గత మూడు రోజులుగా ఇజ్రాయిల్ ఇంటి ముందు రెక్కీ నిర్వహించిన దస్తగిరి సోమవారం ఉదయం 9 గంటలకు ఇజ్రాయిల్ తన స్కూటీపై ఒంటరిగా రావటాన్ని పసిగట్టి..ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు రక్తపు మడుగులో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఇజ్రాయిల్‌ను సమీపంలోని డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఇజ్రాయిల్ అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కాగా పోలీసులు గృహిణి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకోలేదని, తీసుకుని ఉంటే ఈ హత్య జరిగేది కాదని స్థానికులు విమర్శిస్తున్నారు. కాగా ఇజ్రాయిల్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర మాజీ డైరెక్టర్‌గా పనిచేశాడు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశారు.

దివ్యాంగులకు శాశ్వత కార్డులు

- సదరం స్థానంలో యూడీఐడీ కార్డులు
- ప్రత్యేక పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు
- నూతన కార్డులతో కేంద్ర ప్రభుత్వ పథకాలు



యూడీఐడీ స్మార్టు కార్డు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం సదరం క్యాంపులో దివ్యాంగులను గుర్తించి వారికి సర్టిఫికెట్లను అందిస్తోంది. ఈ సదరం సర్టిఫికెట్లు కేంద్ర ప్రభుత్వ పథకాల్లో, ఉద్యోగాల్లో గుర్తించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం సదరం స్థానంలో యూనిక్ డిజేబులిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ) అందించేందుకు ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటుచేశారు. ఈ పోర్టల్‌లో దివ్యాంగులు నేరుగా ఇంటివద్ద నుంచే దరఖాస్తులను చేసుకోవచ్చును. బస్సు, రైలు ప్రయాణాల్లో అందించే రాయితీలతో పాటుగా విద్య, వైద్య, ఉద్యోగ తదితర వాటిల్లో రిజర్వేషన్లకు యూడీఐడీ కార్డుల పరిగణలోకి తీసుకోనున్నారు.

యూడీఐడీ దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం సదరం క్యాంపుల్లో పరీక్షలు చేసి దివ్యాంగుల సర్టిఫికెట్ అందించింది. వీరు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

- http://www.swavlambancard.gov.in పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలి.
- పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, సంతకం తదితర వివరాలను అప్‌లోడ్ చేయాలి.
- మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సమీపంలో ఉన్న సదరం క్యాంపునకు హాజరవ్వాలి.
- స్లాట్ బుక్ చేసుకున్న రోజున శిబిరానికి హాజరైన వారిని విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షలు చేసి వైకల్య శాతాన్ని నిర్ధారించి పోర్టల్‌లో నమోదు చేస్తారు.
- వివరాలు సరిచూసి వైద్యులు నిర్ధారించిన తర్వాత స్మార్ట్ కార్డులు మంజూరు చేస్తుంది.
- డిజిటల్ సంతకంతో కూడిన స్మార్ట్ కార్డులో ఐడీ నంబర్‌తో పాటు దివ్యాంగుడి పేరు, వైకల్య శాతం నమోదు వివరాలుంటాయి.
- ఈ కార్డు నేరుగా దివ్యాంగుడి ఇంటి చిరునామాకు పోస్టులో పంపిస్తారు.
- ఈ కార్డును దేశ వ్యాప్తంగా ఎక్కడైనా వినియోగించుకోవచ్చు.

దరఖాస్తులకు ఎదురుచూపులు

మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకు సుమారు వేయి మంది లబ్ధిదారులు ఉంటారు. వీరిలో 581 మందికి దివ్యాంగ పింఛన్లు అందుతున్నాయి. వీరితో పాటు సందరం సర్టిఫికెట్ ఉన్నవారికి పింఛన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించక పోవడంతో అర్హులు దరఖాస్తులు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు.

21 రకాల వైకల్యాలకు..

ది రైట్ ఆఫ్ పర్సన్ విత్ డిజేబులిటీ యాక్ట్ 2016 ప్రకారం కేంద్ర ప్రభుత్వం 21 రకాల వైకల్యాలను గుర్తించింది. సదరంలో ఏడు రకాల వైకల్యాలకు మాత్రమే మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం యూడీఐడీ కార్డుల దరఖాస్తుల్లో మరో 14 రకాల వైకల్యాలలకు అవకాశం కల్పించారు. ఈ కార్డులు పింఛన్లతో పాటుగా అన్ని రకాల సంక్షేమ పథకాలకు దేశవ్యాప్తంగా చెల్లుబాటు అవుతాయి.

ఎంతో ప్రయోజనం



గతంలో సదరంలో ఇచ్చిన సర్టిఫికెట్లకు యూడీఐడీ కార్డులను జారీ చేయడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. సదరం సర్టిఫికెట్లు రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అయ్యేవి. యూడీఐడీ కార్డులు దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతాయి.
– సూరమోని యాదయ్య, దివ్యాంగుల మండల ఉపాధ్యక్షుడు, కేశంపేట

అవగాహన కల్పిస్తున్నాం



యూడీఐడీ కార్డులపై దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో సదరం సర్టిఫికెట్లు కలిగిన వారు స్మార్టు కార్డుకు దరఖాస్తు చేసుకునేలా కృషి చేస్తున్నాం. గతంలో ఏడు రకాల వైకల్యాలకు సర్టిఫికెట్లు కలిగిన వారితో పాటు యూడీఐడీలో 21 రకాల వైకల్యాలకు అవకాశం ఉండటంతో అర్హులైన వారికి సమాచారం ఇచ్చి దరఖాస్తులు చేసేలా కృషి చేస్తున్నాం.
– భగవంతు, ఏపీఎం, కేశంపేట

ఉలిక్కిపడిన మహేశ్వరం

అడ్వకేట్ ఇజ్రాయేల్ హత్యతో విషాదఛాయలు
- కుటుంబ సభ్యులను పరామర్శించిన నేతలు
- నేడు స్వగ్రామం తుమ్మలూరులో అంత్యక్రియలు

మహేశ్వరం: జాతీయ గ్రామీ ణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయేల్‌ను నగరంలోని చంపాపేట్ పరిధి న్యూ మారుతీనగర్‌లో సోమవారం దస్తగిరి అనే వ్యక్తి కత్తులతో పొడిచి హత్య చేశాడు. ఈ హత్యతో మహేశ్వరం ఉలిక్కిపడింది. కందుకూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మండల వాసులు, న్యాయవాదులు, కాంగ్రెస్ నాయకులు హుటాహుటినా అపోలో, ఉస్మానియా ఆస్పత్రికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను, పోలీసులను, వైద్యులతో మాట్లాడి ఘటన తీరును తెలుసుకున్నారు. మృతుడు మాజీ మంత్రి ఇంద్రారెడ్డి, సబితారెడ్డికి సన్నిహితంగా ఉంటూ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేశారు. సబితారెడ్డి 2019లో కాంగ్రెస్‌ను వీడినా ఆయన పార్టీలోనే కొనిసాగారు. మహేశ్వరం కోర్టు బార్ అసోషియేన్ అధ్యక్షుడిగా మహేశ్వరానికి కోర్టు తీసుకురావడంతో ఆయన కీలక పాత్ర పోషించాడు. న్యాయవాదిగా పేదలకు ఉచితంగా న్యాయ సేవలు, సలహాలు అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ రాష్ట్ర డైరెక్టర్‌గా పని చేశారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే కేఎల్లా రాష్ట్ర స్థాయి నామినెటెడ్ పోస్టుకు సైతం ఇజ్రాయేల్ పేరును ప్రతిపాదించారు. మంగళవారం ఆయన స్వగ్రామం తుమ్మలూరులో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి డాన్ అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలించి విక్రయిస్తున్న ఓ గంజాయి డాన్‌ను ఎక్సైజ్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి 115 కిలోల గంజాయి, కారు, మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ తులశ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా, బూర్గుపాడు గ్రామానికి చెందిన దుగ్యంపూడి శివ శంకర్‌రెడ్డి అలియాస్ శివారెడ్డి గంజాయి డాన్‌గా గుర్తింపు పొందాడు. 2019 నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అతను ఇప్పటి వరకు 850 కిలోలకుపైగా గంజాయిని సరఫరా చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడిపై పీటీ వారెంట్ ఉంది. సోమవారం శివారెడ్డి జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు కారులో తరలిస్తున్న 115 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 లక్షలు ఉంటు ందని అంచనా.

ముగ్గురు బీటెక్ విద్యార్థుల అరెస్ట్

కేపీహెచ్‌బీ వసంతనగర్ కాలనీకి చెందిన ముగ్గురు బీటెక్ విద్యార్థులు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ జిల్లా సుల్తాన్‌పూర్‌కు చెందిన రాహుల్, పెద్దపల్లి జిల్లా భూంనగర్ కు చెందిన అజయ్ కుమార్, కమాన్‌పూర్ మండలానికి చెందిన తాడిపల్లి అఖిలాష్‌లను అరెస్టు చేశారు.

ఎవరో ఈ బాలుడు?


పోలీసుల వద్ద ఐదేళ్ల బాలుడు

అత్తాపూర్: పాండురంగానగర్‌లో ఏడుస్తూ కనిపించిన ఐదేళ్ల బాలుడిని స్థానికులు అత్తాపూర్ పోలీసుల కు అప్పగించారు. వివరాలు... అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఐదు సంవత్సరాల బాలుడిని స్థానికులు గుర్తించారు. పుట్టుమూగ, చెవులు కూడా వినిపించకపోవడంతో ఎలాంటి సమాచారం అందించలేకపోతున్నాడు. దీంతో పోలీసులకు ఆ బాబును అప్పగించారు. పిల్లవాడి ఆచూకీ తెలిసిన వారు అత్తాపూర్ పోలీసులు సంప్రదించాలని కోరారు.

నకిలీ లీజు పత్రంతో ఆస్పత్రి రెన్యూవల్

మణికొండ: అద్దె భవనంలో కొనసాగుతున్న ఆస్పత్రి లీజు పత్రాలను ఫోర్జరీ చేసి వైద్య శాఖ అధికారులకు ఇచ్చి లైసెన్స్ రెన్యూవల్ చేయించిన డైరెక్టర్‌ను నార్సింగి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. నార్సింగి మున్సిపల్ కేంద్రంలో రెండు దశాబ్దాలుగా అరోణా ఆస్పత్రిని డాక్టర్ అలియమ్మ సెబాస్టియన్ కొనసాగిస్తుంది. భవన యజమానితో 2021వ సంవత్సరంలో అద్దె ఒప్పందం ముగిసింది. అయినా ఆస్పత్రిని ఖాళీ చేయకపోవటం, అద్దె ఒప్పందం తిరిగి చేసుకున్నట్టు నకిలీ పత్రాలను సృష్టించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు అందజేశారు. దీంతో వారు ఆస్పత్రి నిర్వహణకు అనుమతులను జారీ చేశారు. భవన యజమాని మరణించటంతో అతని కూతురు సనా ఫాతిమా నార్సింగి పోలీసులకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. దాంతో విచారణ చేపట్టిన పోలీసులు ఆస్పత్రి డైరెక్టర్, డాక్టర్ అలియమ్మ సెబాస్టియన్ నకిలీ పత్రాలను సృష్టించి వైద్య శాఖ అధికారులను బురిడీ కొట్టించిన విషయం తెలుసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నార్సింగి పోలీసులు తెలిపారు.

శిలాఫలకం దిమ్మె కూలి చిన్నారి మృతి

అల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఘటన


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్


సాయితేజ(ఫైల్)

కుల్కచర్ల: ఉపాధి హామీ పనుల వివరాలు తెలియజేసేశిలాఫలకం దిమ్మె ఓ చిన్నారి ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది. ఈ ఘటన కుల్కచర్ల మండలం అల్లాపూర్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన విస్లావత్ లక్ష్మణ్, నవనీత దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు అబ్బాయిలు సంతానం. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందరిలో చిన్నవాడైన సాయితేజ(4) ఉదయం 8:30 గంటలకు సహచర మిత్రులతో కలిసి స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లాడు. ఉపాధి పనుల వివరాలు తెలియజేస్తూ భవనం ఎదుట ఏర్పాటు చేసిన దిమ్మె వద్ద ఆడుకుంటుండగా.. అప్పటికే పగుళ్లు పెట్టిన సిమెంట్ దిమ్మె విరిగి సాయితేజ తలపై పడింది. దీంతో చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అధికారుల నిర్లక్ష్యం

ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ సెంటర్ ఎదుట పదేళ్ల క్రితం నిర్మించిన ఉపాధి హామీ శిలాఫలకం దిమ్మె విరిగిపోయి ప్రమాద భరితంగా మారింది. దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితమే అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేయడంతో ఆయాగా విధులు నిర్వర్తిస్తున్న కమ్లీ బాయి సెంటర్‌ను నడిపిస్తున్నారు. అల్లారుముద్దుగా చూసుకుంటున్న తమ కొడుకు విగత జీవిగా మారడాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

బాలుడి మృతిపై స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జింకల యాదయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, రవి తదితరులను పంపించి, బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మృతుడి తల్లికి అంగన్‌వాడీలో ఉద్యోగం కల్పించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జింకల యాదయ్య, బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్, రవి తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలి

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పిల్లల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమడుతోందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. కుల్కచర్ల మండలం అల్లాపూర్ తండాలో శిలాఫలకం దిమ్మె కూలి మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బాలుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..అధికారుల నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలైందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న బాలుడు మృతి చెందడం బాధాకరమన్నారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయండి

ప్రజావాణిలో మొండిగౌరెల్లి గ్రామస్తుల వినతి


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మొండిగౌరెల్లి వాసులు

యాచారం: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మెండిగౌరెల్లి గ్రామస్తులు హాజరయ్యారు. మొండిగౌరెల్లి గ్రామంలో అసైన్డ్, పట్టా భూములు సేకరణకు వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. సార్ మీరే మా భూములు కాపాడాలి.. ఏళ్లుగా ఆ భూములను నమ్ముకుని కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాం, ఆ భూములను పారిశ్రామిక పార్కుల పేరుతో సేకరిస్తే తమ జీవనోపాధి కోల్పోతామని కలెక్టర్‌కు వివరించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మీ గ్రామ భూములు తీసుకోవద్దని చాల ఫోన్లు వస్తున్నాయని.. నేనే స్వయంగా వచ్చి ఆ భూములను పరిశీలిస్తానని.. రైతులు సాగులో ఉంటే భూసేకరణ చేపట్టవద్దని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని కలెక్టర్ మొండిగౌరెల్లి రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మేకల యాదగిరిరెడ్డి, మర్పల్లి అంజయ్య యాదవ్, తాండ్ర రవీందర్, బండిమీది కృష్ణ, గుర్రం భాస్కర్‌రెడ్డి, మాదం జంగయ్య, మర్పల్లి బాల్‌రాజ్, నక్క శ్రీనివాస్ యాదవ్, మంగలి సత్తయ్య, కట్టెల కృష్ణ, కుంటి రాజు పాల్గొన్నారు.

విమానాశ్రయం ఏర్పాటుకు వినతి


కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ఎంపీ మల్లురవి

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

మాడ్గుల: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్‌రావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఇర్విన్ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపి వాహన పత్రాలు పరిశీలించారు. మట్టి తరలింపునకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్, జేసీబీ సీజ్ చేశారు. డ్రైవర్లు, వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

మద్యంమత్తులో వాహనం నడుపుతూ..

పోలీసులకు చిక్కిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్

పంజగుట్ట: మద్యం మత్తులో వాహనం నడుతున్న వాటర్ ట్యాంకర్ డ్రైవర్ పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెలితే .. సోమవారం ఉదయం పంజగుట్ట అమీర్‌పేట రహదారిపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు అటుగా వస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఆపి వాహనం పత్రాలు చూపించాలని కోరారు. అయితే అతని నోటిలో నుంచి మద్యం వాసన వస్తుండటాన్ని గుర్తించిన పోలీసులు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు నిర్వహించగా బీఏసీ 325 వచ్చింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు వాటర్ ట్యాంకర్ డ్రైవర్ యాదగిరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

కల్లు తాగేందుకు వచ్చి చైన్ స్నాచింగ్

- పెనుగులాటలో మహిళ మెడకు గాయం
- అరతులం పుస్తెను ఎత్తుకెళ్లిన దుండగులు


ప్రేమలత


మెడభాగంలో గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: కల్లు తాగే నెపంతో వచ్చిన దుండుగులు మహిళ మెడలోంచి పుస్తెలతాడు లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించడంతో పాటు కేకలు పెట్టడంతో చేతికి చిక్కిన అర తులం పుస్తెతో ఉడాయించారు. ఈ ఘటన ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల మున్సిపల్ పరిధి ఎంపీపటేల్‌గూడకు చెందిన తక్కళ్లపల్లి యాదయ్య, ప్రేమలత దంపతులు కల్లుగీత కార్మికులు. యాదయ్య కల్లు గీస్తుండగా.. ప్రేమలత కొంగరకలాన్ మార్గంలో సాహెబ్‌గూడ గేట్ సమీపంలో విక్రయిస్తుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు ముగ్గురు దుండగులు కల్లు తా గేందుకు వచ్చారు. ఒకరు బైక్‌పై ఉండగా మరో ఇద్దరు వచ్చి కల్లు మండువా పక్కన కాల్వ వద్ద కూర్చుని కల్లు తీసుకురమ్మని ప్రేమలతకు చెప్పారు. దీంతో ఆమె కల్లు తెచ్చేందుకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగులు ఆమె నోరు మూసి కిందపడేశారు. మరో వ్యక్తి మెడలో పుస్తెల తాడు లాగుతుండగా ఆమె గట్టిగా పట్టుకుని అరవడంతో రోడ్డుపై వస్తున్న వారిని గమనించి బైక్‌పై మంగళ్‌పల్లి వైపు పరారయ్యారు. ఈ పెనుగులాటలో మహిళ మెడభాగంలో గాయాలయ్యాయి. పుస్తెలతాడుకున్న అరతులం పుస్తెను దుండగులు ఎత్తుకెళ్లగా మూడు తులాల తాడు దక్కింది. పదేళ్ల క్రితం సైతం మూడున్నర తులాల పుస్తెలతాడు దొంగలు ఎత్తుకెళ్లారని.. ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ న్యాయం జరగలేదని.. అందుకే ఈ ఘటనపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేసింది.